# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ దేశీయ కంటెంట్, ప్రాంతీయ భాషలను ప్రోత్సహించేలా భారతీయ ఏఐ నమూనాలు ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంకుర సంస్థలకు సూచించారు.

❖ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2026 రెండవ ఎడిషన్ న్యూఢిల్లీలోని భారత మండపం వేదికగా రేపటి నుండి ప్రారంభం కానుంది.

❖ కేంద్ర ప్రభుత్వం 2027 జనగణన మొదటి దశకు సంబంధించిన నోటిఫికేషనన్ విడుదల చేసింది.

❖ ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ ఎల్లప్పుడూ మానవ విచక్షణకు, బాధ్యతకు లోబడి ఉండాలని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

❖ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన రవాణా మంత్రుల వార్షిక సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ ఏఐ అంకుర సంస్థల రౌండ్ టేబుల్ సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో ఈరోజు జరిగింది. వచ్చే నెలలో జరగనున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు-2026లో భాగమైన "ఏఐ ఫర్ ఆల్ : గ్లోబల్ ఇంపాక్ట్ ఛాలెంజ్"లో పాల్గొనేందుకు ఎంపికైన 12 భారతీయ ఏఐ అంకుర సంస్థలు ఈ సమావేశంలో పాల్గొని తమ ఆలోచనలను ప్రధానితో పంచుకున్నాయి. ఆరోగ్య సేవలు, బహుభాషా ఎల్ఎల్ఎంలు, మెటీరియల్ పరిశోధన, డేటా అనలిటిక్స్, ఇంజినీరింగ్ సిమ్యులేషన్ మొదలగు వివిధ రంగాల్లో పని చేస్తున్న ఈ 12 అంకుర సంస్థలు కృత్రిమ మేధను ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశంసించాయి. ఏఐ రంగానికున్న వేగవంతమైన వృద్ధిని, విస్తృతమైన భవిష్యత్ సామర్థ్యాన్ని ఈ సందర్భంగా ఆ సంస్థలు వివరించాయి. భారత భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో అంకుర సంస్థలు, ఏఐ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సహ నిర్మాతలని పేర్కొన్న ప్రధానమంత్రి.. స్థానిక, దేశీయ కంటెంట్, ప్రాంతీయ భాషలను ప్రోత్సహించేలా భారతీయ ఏఐ నమూనాలు ఉండాలని ఆ అంకుర సంస్థలకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2026 రెండవ ఎడిషన్ న్యూఢిల్లీలోని భారత మండపం వేదికగా రేపటి నుండి ప్రారంభం కానుంది. ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమాన్ని శనివారం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ లాంఛనంగా ప్రారంభిస్తారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా చెప్పారు. ఈ రోజు న్యూఢిల్లీలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... 12వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేశ, విదేశాల నుండి 2 వేల 500 మందికి పైగా యువత పాల్గొంటారని... ఇస్రో వ్యోమగాములు శుభాంశు శుక్లా, ప్రశాంత్ నాయర్, భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఇలా పలు రంగాలకు చెందిన నిపుణులు యువతతో మమేకమవుతారని మన్సుఖ్ మాండవీయా వెల్లడిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం 2027 జనగణన మొదటి దశకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈరోజు విడుదల చేసింది. తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గృహాలు, నిర్మాణాల జాబితాల తయారీ, వాటి నమోదు ప్రక్రియను చేపడతారని కేంద్ర హోం శాఖ తెలిపింది. తొలుత 30 రోజుల పాటు అన్ని గృహాలు, నిర్మాణాల జాబితాను తయారు చేస్తారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ఏ తరహా నిర్మాణం, వంట గది, స్నానాల గది తదితర సదుపాయాల వివరాలను నమోదు చేస్తారు. ఈ దఫా కొత్తగా స్వీయ గణన నమోదు అవకాశాన్ని కూడా కల్పిస్తున్నట్లు హోం శాఖ తెలిపింది. ఏప్రిల్ 1న తొలి దశ ప్రారంభానికి 15 రోజులు ముందుగా ఈ ప్రక్రియను చేపడతారు. ఇందుకోసం ఆన్‌లైన్ పోర్టల్ కూడా అందుబాటులోకి రానుంది. ఈ దఫా జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో, ఫోన్ యాప్స్ ద్వారా జరగనుంది. 30 లక్షల మంది ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు ఈ విధుల్లో పాల్గొంటారు. గత నెల 12న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో జనాభా లెక్కల సేకరణకు సుమారు 11 వేల 718 కోట్ల రూపాయలకు పైగా కేటాయింపునకు ఆమోదం తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా మంత్రుల వార్షిక సమావేశానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షత వహించారు. రోడ్డు భద్రత, ప్రయాణీకుల సౌకర్యాలు, వ్యాపార నిర్వహణ సరళీకరణ, ఆటోమొబైల్ నిబంధనలు వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయని ఆయన తెలిపారు. సమావేశం అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... రాజ్యాంగం ప్రకారం రవాణా అనేది ఉమ్మడి జాబితాలోని అంశం కావడంతో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సమర్థవంతమైన, సురక్షితమైన, పౌర కేంద్రీకృత రవాణా పరిష్కారాలను అందించడానికి ఇటువంటి క్రమబద్ధమైన చర్చలు ఎంతో అవసరమని ఈ సందర్భంగా మంత్రి ఉద్ఘాటించారు. ఇటీవల రహదారులపై జరుగుతున్న బస్సు ప్రమాదాల దృష్ట్యా నిబంధనలను సవరించామని చెప్పారు. వాటి ప్రకారం.. ఇకపై ఆటోమొబైల్ తయారీదారులు మాత్రమే బస్ ఆకృతులను తయారు చేస్తారని నితిన్ గడ్కరీ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

క్రియాశీల పాలనను సకాలంలో అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టిన "ప్రగతి" వేదిక 50వ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడంతో ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీనిని ప్రారంభించినప్పటి నుండి, ప్రత్యక్ష సమీక్ష ద్వారా కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రజా ఫిర్యాదులను రియల్ టైంలో పరిష్కరించడం ద్వారా ప్రగతి పాలనను విశేషంగా మార్చింది. భారతదేశ పట్టణ పరివర్తన ఆర్థిక వృద్ధి, సామాజిక పరివర్తనకు ప్రధాన చోదకంగా ఉద్భవిస్తోంది. పట్టణ ప్రాంతాలు ప్రస్తుతం 48 కోట్లకు పైగా ప్రజలకు నిలయంగా ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పన్నెండు ప్రగతి సమావేశాలలో ఇప్పటివరకూ ఏడు కీలక పట్టణ పథకాలను సమీక్షించారు. వాటి వ్యూహాత్మక ప్రాముఖ్యతను అత్యున్నత స్థాయిలో నిశిత పర్యవేక్షణ అవసరాన్ని ఆయా సమావేశాల్లో ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టులలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్, స్మార్ట్ సిటీస్ మిషన్, PM స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి పథకం కూడా ఉన్నాయి. రెండు లక్షల 37 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పద్నాలుగు కీలక ప్రాజెక్టులను కూడా ప్రగతి యంత్రాంగం కింద సమీక్షించారు. వీటిలో నాలుగు ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభమవగా పది అమలులో ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ఎల్లప్పుడూ మానవ విచక్షణకు, బాధ్యతకు లోబడి ఉండాలని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన "ఏఐ ఫర్ కెపాసిటీ బిల్డింగ్ : ట్రాన్స్‌ఫార్మింగ్ గవర్నెన్స్" కార్యశాలలో ఈరోజు ఆయన పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్పందించే, సమర్థవంతమైన ప్రజా పరిపాలనను నిర్మించడంలో కృత్రిమ మేధస్సు (AI), మానవ మేధస్సుతో కూడిన "హైబ్రిడ్ మోడల్" పరిపాలనకు అత్యంత కీలకమని చెప్పారు. కృత్రిమ మేధస్సును ఒక శక్తివంతమైన సాధనంగా మాత్రమే చూడాలని, అది అంతిమ లక్ష్యం కాదని ఆయన స్పష్టం చేస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సోమనాథ్ ఆలయం శాశ్వత స్ఫూర్తిని చాటిచెప్పే నాలుగు రోజుల "సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్" భక్తి శ్రద్ధల నడుమ వైభవంగా ఈరోజు ప్రారంభమయ్యింది. క్రీ.శ. 1026 జనవరిలో సోమనాథ్ ఆలయంపై మొదటిసారిగా దాడి జరిగి 2026 నాటికి వెయ్యి సంవత్సరాలు పూర్తవుతాయి. 1951లో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయ ద్వారాలు తెరిచిన చారిత్రాత్మక వేడుకకు ఈ సంవత్సరంతో 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో స్వాభిమాన్ పర్వ్ ను జరుపుకుంటున్నాం. "సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్" ప్రారంభం కావడంతో.. అరేబియా సముద్రతీరం ఆధ్యాత్మిక శక్తితో పులకించింది. ఈ ఉత్సవానికి నాంది పలుకుతూ.. మొదటి జ్యోతిర్లింగం వద్ద 72 గంటల పాటు నిరంతరాయంగా సాగే "అఖండ ఓంకార జపం" ప్రారంభమైంది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, గుజరాత్ రాష్ట్ర మంత్రులు జితు వాఘాని, డాక్టర్ ప్రద్యుమన్‌భాయ్ వాజాలతో కలిసి లాంఛనప్రాయ శంఖారావాన్ని పూరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =